

దొంగల అరెస్ట్

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను కోదాడ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



'స్వదేశ్ దర్శన్'లో లేనట్టేనా..

స్వదేశ్ దర్శన్ పథకంలో అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌కు చోటు దక్కలేదు. - 10లో

గరిష్టం/కనిష్టం
41°/28°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పూట సూర్యరశ్మి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వచ్చే నెల 10న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా కోర్టు ప్రాంగణంలో జూన్ 10 వతేదీన జాతీయ మెగాలోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ వెల్లడించారు. లోక్ అదాలత్ నిర్వహణ నేపథ్యంలో సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, న్యాయవాదులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కోర్టులో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండి పరిష్కారం అయ్యే కేసులను సాల్వ్‌చేసుకోవాలని ఆయన సూచించారు. దీని వల్ల కాలం, ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. సంబంధిత కేసులో ఇరువర్గాల వారు గెలిచిన వారవుతారన్నారు. జ్యుడీషియల్, పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో పని చేసి లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ న్యాయ సేవా అథారిత సంస్థ కార్యదర్శి పి. శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్, అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన వాయిదా

చందంపేట: చందంపేట మండలం గువ్వలగుట్టలో సోమవారం జరగాల్సిన రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పర్యటన వాయిదా పడింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా గవర్నర్ పర్యటన వాయిదా పడినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

25న ఉప్పేల వీరారెడ్డి విగ్రహావిష్కరణ

నేరేడుచర్ల :ఈనెల 25న హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెంలో తెలంగాణ సాయుధ పోరాటయోధుడు ఉప్పేల వీరారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ హాజరవుతారని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇంధన వనరులను పొదుపుగా వాడాలి

చివ్వెంల(సూర్యాపేట) : ఇంధన వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఆర్‌ఈడీసీఓ) ఉమ్మడి జిల్లా మేనేజర్ కె.సూర్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇంధన వనరుల వినియోగంపై స్త్రీశక్తి భవనంలో మహిళల సంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఇళ్లలో నిత్యావసరంగా వినియోగించే గ్యాస్, విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించి, భావితరాలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఇంట్లో వినియోగించని సమయంలో వాటిని ఆఫ్ చేయాలన్నారు. పొదుపు చేయడంపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్‌ఈడీ బల్బులు పంపిణీ చేసి విద్యుత్ ఆదా గురించి వివరించారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మీ నారాయణ, ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

మండారి ప్రభాకర్ ఆశయాలు సాధించాలి

భానుపురి : తెలంగాణ ఉద్యమ నాయకుడు మండారి ప్రభాకర్ ఆశయాల సాధన కోసం పోరాడుదామని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రభాకర్ నాలుగో వర్ధంతి సందర్భంగా స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు గట్ల రమశంకర్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ నాగరాజు, జేఏసీ నాయకులు దాసు సతీష్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు మల్లయ్య యాదవ్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ కుమార్, కార్యదర్శి ఎర్ర వీరన్న, జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి శ్రీనివాస్ యాదవ్, బొమ్మగాని వినయ్ గౌడ్, బంధన్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

పాత వస్తువులివ్వండి!

సామగ్రి సేకరణకు మున్సిపాలిటీల్లో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ఏర్పాటు

- మేరా లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్ పేరిట ప్రత్యేక కార్యక్రమం
- వచ్చేనెల 5వరకు కొనసాగనున్న ప్రక్రియ



హుజూర్‌నగర్‌లో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం ద్వారా పాత బట్టలు సేకరిస్తున్న సిబ్బంది

హుజూర్‌నగర్: మున్సిపాలిటీల్లో పాత వస్తువుల పునర్వినియోగానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెడ్యూస్(తగ్గించడం), రీయూజ్ (మళ్లీ ఉపయోగించడం), రీ సైకిల్ (మళ్లీ ఉత్పత్తి) పేరిట వ్యర్థ వస్తువులు, పాత సామగ్రి సేకరణకు ప్రతి వార్డులో కేంద్రాలను ఏర్పాటు చేశారు. వచ్చేనెల 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. దీని పర్యవేక్షణకు ప్రత్యేకంగా బాధ్యులను కూడా నియమించారు.

వస్తువుల వివరాలు రికార్డులో నమోదు

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మేరా లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్ పేరిట ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమం అమలులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్ల నుంచి పాత సామగ్రిని సేకరిస్తున్నారు. పునర్వినియోగానికి ఉపయోగపడే వ్యర్థాలన్నింటినీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో అందజేయాలని అధికారులు సూచిస్తున్నారు. వార్డు ప్రజల నుంచి తెచ్చిన వస్తువులు ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలి. ఎవరు ఇచ్చారు, వారి పేరు, ఇంటి నంబర్, సెల్ ఫోన్ నంబర్, వస్తువుల పేర్లు రాయాలి. ఈ సామగ్రిని ఆయావార్డుల్లో ఎవరికైనా అవసరమైతే వాటిని ఉచితంగా అందజేయాలి.

రోజూ 136 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. అవి సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల. ఆయా మున్సిపాలిటీల పరిధిలో వ్యర్థాల సేకరణకు ప్రత్యేకంగా ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ ఐదు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 141 వార్డులు, 66,296 భవనాలు ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ 136 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది.

సేకరించే వస్తువులు ఇవీ..

వార్డుల ప్రజల నుంచి సేకరించే వస్తువులు ఏమిటంటే ప్లాస్టిక్, వంట సామగ్రి, వివిధ పుస్తకాలు, పేపర్లు, పాతదుస్తులు, పాదరక్షలు, ఇనుప సామగ్రి, పరుపులు, దిండ్లు, కుర్చీలు, బల్లలు, మంచాలు, పాలిథీన్ వ్యర్థాలను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ద్వారా సేకరిస్తారు. ఏళ్ల నుంచి ఇళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తగ్గించేందుకు పురపాలక శాఖ ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. వార్డుల్లో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉండి పాత వస్తువులు సేకరిస్తారు. ప్రజలు ఇచ్చిన వస్తువులకు రసీదు కూడా అందజేస్తారు. మున్సిపాలిటీల్లోని వార్డుల్లో వివిధ రకాల వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకు పోతున్నాయి. వీటి ద్వారా ఇళ్లలో వార్డుల్లో పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. దీంతో ఆయా ఇళ్లలో వార్డుల్లో స్థల సమస్య నెలకొంటోంది. వ్యర్థాలను తొలగించి ఆధునీకరిస్తే ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుంది. మున్సిపాలిటీల్లో తాజాగా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడంపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇళ్లలో పేరుకుపోయిన పాత సామగ్రిని ఆయా వార్డుల్లో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాలకు తెచ్చి ఇస్తున్నారు.

సేకరించిన వాటిని పునర్వినియోగానికి అందజేస్తాం



మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రాల ద్వారా సేకరించిన వ్యర్థాలను పునర్వినియోగం కోసం అందజేస్తాం. ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల ద్వారా సమకూరిన వ్యర్థాలు ప్రజలకు అవసరమైతే తీసుకెళ్లవచ్చు. జూన్ 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రజలు సహకరించాలి.

– అశోక్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, హుజూర్‌నగర్

మున్సిపాలిటీల వారీగా చెత్త సేకరణ

మున్సిపాలిటీ	వార్డులు	భవనాలు	రోజూ చెత్త ఉత్పత్తి (మెట్రిక్ టన్నుల్లో)
సూర్యాపేట	48	33,062	65
కోదాడ	35	16,245	32
హుజూర్‌నగర్	28	7,4,79	25
తిరుమలగిరి	15	5,248	09
నేరేడుచర్ల	15	4,262	05

మరో ఆరునెలలు..

- పాఠశాల యాజమాన్య కమిటీల గడువు పొడిగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ
- 950 మంది ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీ చైర్మన్ల పదవీకాలం పెంపు
- డిసెంబర్‌లో కొత్త కమిటీలను ఎన్నుకునే అవకాశం



నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నాగారం : ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)లను మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పదో తరగతి పూర్తయ్యాక, వారి తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లుగా లేదా సభ్యులుగా ఉంటే వారి స్థానంలో కొత్త వారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉత్తర్వులతో ప్రస్తుతం ఉన్న వారు మరో ఆరు నెలలు కొనసాగనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత మన ఊరు–మనబడి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీ చైర్మన్లు, సభ్యుల తీర్మానాలతో పనులు చేస్తున్నారు. ఇటు మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందే ప్రతి సంక్షేమ పథకంలో వారికి బాధ్యతలు అప్పగించి, పర్యవేక్షించేలా ప్రభుత్వం అధికారం కూడా ఇచ్చింది.

నవంబర్ 30వ తేదీ వరకు..

జిల్లాలో ఎస్‌ఎంసీ చైర్మన్లు 950 మంది ఉన్నారు. వారి పదవీ కాలం ఈనెల31వ తేదీతో ముగియనుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ ఏడాది నవంబర్ 30 వరకు ప్రస్తుతం ఉన్నవారే కొనసాగనున్నారు. జిల్లాలో 950 పాఠశాలల్లో మొదటి దశలో మన ఊరు–మనబడి కింద రూ.117.31కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు వీరి పరిధిలోనే కొనసాగుతున్నాయి. పనుల్లో నాణ్యత ఇతర అంశాలు పరిశీలించడానికి వీరికి అధికారం ఉంది.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి



ఎస్‌ఎంసీ చైర్మన్ల పదవీ కాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. నవంబర్ వరకు పాతవారే ఎస్‌ఎంసీ చైర్మన్లుగా కొనసాగుతారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇచ్చిన క్రమంలో కొత్త కమిటీల ఎంపిక డిసెంబర్‌లో జరిగే అవకాశం ఉంది.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ



భాగ్యరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు తదితరులు

- మంత్రి జగదీశ్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దళితుల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించిన మహనీయులు యం. భాగ్యరెడ్డి వర్మ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ యస్. వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళితుల విషయంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ ఆది హిందూ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ముఖ్యంగా ఆర్య సమాజానికి వారి అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించడం వల్ల వర్మ అనే బిరుదు పొందారని పేర్కొన్నారు. గత పాలకులు తెలంగాణ మహనీయులను గుర్తించక పోవడంతో రాష్ట్రం సాధించుకున్నాక వారి జయంతులు, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం దళితుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పి. అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, జెడ్పీటీసీ జీడీ భిక్షం, మాజీ శాసన సభ్యుడు దోసపాటి గోపాల్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ యస్. వెంకట్రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు శాఖల వారీగా చేపట్టే కార్యక్రమాలపై విధివిధానాలు సిద్ధం చేయాలన్నారు. మండల స్థాయిలో జూన్ 3, 4 తేదీల్లో ధరణి ద్వారా భూసంబంధ దరఖాస్తులు స్వీకరించి జిల్లా స్థాయిలో 5, 6 తేదీల్లో నిర్వహించే కార్యక్రమంలో పరిష్కారం చూపాలన్నారు.

పిల్లలకు మెరుగైన సేవలు అందించాలి

పిల్లల సంరక్షణకు గాను మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ యస్. వెంకట్రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా దత్తత స్వీకరణ పత్రాలను (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ప్రథమంగా దత్తత ప్రక్రియ జిల్లాలో చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, మోహన్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ, బాలల పరిరక్షణ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ యస్. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, మోహన్‌రావులతో కలసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో భూసమస్యల పై 39, ఇతర శాఖలకు సంబంధించి 13 మొత్తం 52 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాసరెడ్డి నేరేడుచర్లకు బదిలీ అయ్యారు. నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్లును హుజూర్‌నగర్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వెంకటేశ్వర్లు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌డేలో తొమ్మిది ఫిర్యాదులు

సూర్యాపేట క్రైం: పోలీస్ గ్రీవెన్స్‌డేలో తొమ్మిది ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ప్రజలనుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుడితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై వేగంగా చర్యలు తీసుకోవాలని బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి అఖిల్‌ను కలెక్టర్ వెంకట్రావు ఆదివారం సస్పెండ్ చేసినట్లు ఎంపీఓ నరేష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 17న కలెక్టర్ సింగారెడ్డిపాలెం గ్రామ పంచాయతీ పరిశీలనకు వచ్చినప్పుడు జూనియర్ పంచాయతీ కార్యదర్శి లేడు. దీంతో ఈ విషయమై కలెక్టర్.. అడగగా తన పెదనాన్న చనిపోయారని చెప్పి సెలవు పెట్టారని అధికారులు తెలిపారు. కలెక్టర్ విచారణ జరిపించగా తప్పుడు సమాచారంతో సెలవు పెట్టినట్లు తేలడంతో చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

క్రీడల అభివృద్ధికి కృషిచేస్తా




క్రీడా జ్యోతితో ఎంపీ, కలెక్టర్, ఎస్పీ




మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

- జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలను ప్రారంభించిన ఎంపీ బడుగుల

సూర్యాపేటటౌన్ : క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ తెలిపారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలను కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌లతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుతుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక క్రీడలను అభివృద్ధి చేయడంతో పాటు గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి ఏడాదికి ఒక్కో విద్యార్థిపై రూ.1.25లక్షలు ఖర్చు చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో 23 మండలాల నుంచి 91 జట్లు, 1,282 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ క్రీడలు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా క్రీడల, యువజన అధికారి వెంకట్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సురేష్, డీఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ లింగయ్య, చిత్రంలో కలెక్టర్, అదనపు కలెక్టర్



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

జేపీఎస్‌లకు తీపికబురు

- జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- 336 మంది జేపీఎస్‌లకు ప్రయోజనం
- సమ్మెతో దిగివచ్చిన సర్కారు



నిరసనలో భాగంగా బతకమ్మలు పేర్చుతున్న జేపీఎస్‌లు (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం నుంచి తీపి కబురు అందించింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను సీఎం ఆదేశించారు. తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని 16రోజుల పాటు చేసిన సమ్మెకు ఫలితం దక్కింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగిన విషయం విదితమే. 16 రోజుల పాటు సమ్మె చేయగా... వెంటనే విధుల్లో చేరాలని లేకుంటే కొత్త వారిని నియమిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యాదర్శి ఈ నెల 14 న ఆదేశాలు జారీ చేయగా సమ్మెలో ఉన్న కార్యదర్శులు విధుల్లో చేరారు. అయితే ప్రభుత్వం జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయం తీసుకొని విధివిధానాలను రూపొందించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

336 జేపీఎస్‌లకు లబ్ధి

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా 133 మంది రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు, 336 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 52 మంది అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను 2019 ఏప్రిల్‌లో రాత పరీక్ష ద్వారా ఎంపిక చేశారు. తర్వాత రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టుల్లో ఏర్పడ ఖాళీలను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేశారు. అయితే జేపీఎస్‌ల నియామకం సమయంలో మూడు ప్రొబేషన్ పీరియడ్లుగా ఉంటుందని, ఈ గడువు ముగిసిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ అనుకున్న సమయానికి రెగ్యులరైజ్ చేయకపోవడంతో జేపీఎస్‌లు సమ్మెకు దిగారు. ఇదిలా ఉంటే ఓపీఎస్‌లను తొలగించి వారి స్థానంలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

16 రోజుల పాటు సమ్మె

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని జేపీఎస్‌లు 16 రోజుల పాటు సమ్మె చేసిన విషయం తెలిసిందే. సమ్మె చేస్తున్న జేపీఎస్‌లకు రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. సమ్మె విరమించి ఈ నెల 14వ తేదీ మధ్నాహ్నం 12 లోపు విధులకు హాజరు కాకపోతే వారిని ఉద్యోగాల్లోంచి తొలగిస్తామని ప్రకటించింది. జేపీఎస్‌లతో అధికారిక చర్చలు ఉండవని ప్రభుత్వం తేల్చిచెప్పింది . మధ్యాహ్నం 12 గంటల లోపు విధుల్లో చేరని వారు ఉద్యోగులుకారని ప్రకటించింది.12 గంటల లోపు డ్యూటీలో లేని వారిని గుర్తించి, గ్రామాల వారీగా లిస్ట్ డీపీఓలకు పంపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించి డిగ్రీ చదివిన వారిని తాత్కాలికంగా జేపీఎస్‌లుగా నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో జేపీఎస్ పరీక్ష రాసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని లేదా రిజర్వేషన్ ప్రకారం నియమించాలని సూచించింది. సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేకపోతే వారి టర్మ్ ముగిసినట్లు ప్రకటించింది. ఈ వ్యవహారంలో జేపీఎస్‌లకు చివరి అవకాశంగా మంత్రి ఎర్రబెల్లి నుంచి సంకేతాలు వెళ్లాయి. దీంతో సమ్మె విరమిస్తామని జేపీఎస్‌లు ప్రకటించి విధుల్లో చేరారు.

జిల్లా స్థాయిలో కమిటీలు

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరును మదింపు చేయడానికి జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు వేయాలని సీఎం సూచించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా ఫారెస్టు అధికారి, జిల్లా ఎస్పీ లేదా డీసీపీ మెంబర్లుగా ఉంటారు. దీనికి రాష్ట్రస్థాయి నుంచి ఒక సెక్రటరీ స్థాయి లేదా హెచ్‌ఓడీ స్థాయి అధికారి పరిశీలకుడిగా వ్యవహరిస్తారు. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఒక కమిటీని వేస్తారు. జిల్లా స్థాయి కమిటీ ద్వారా పంపించిన ప్రతిపాదనను రాష్ట్రస్థాయి కమిటీ పరిశీలిస్తుంది. ఆ తర్వాత రాష్ట్ర స్థాయి కమిటీ చీఫ్ సెక్రటరీకి నివేదికను పంపిస్తుంది.

క్లుప్తంగా

పెట్రోల్ బంక్ వద్ద స్కూటీ దగ్ధం

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద సోమవారం ఓ స్కూటీ దగ్ధమైంది. ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సోయబుల్లా సయ్యద్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజపేట మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన నకిర్త రాములు సోమవారం తన స్కూటీలో ఆలేరు జీఎంజీ స్కూల్ ఎదురుగా ఉన్న వెంకటసాయి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకున్నాడు. బంక్ సమీపంలోనే స్కూటీ నుంచి పెట్రోల్ లీకై ఇంజన్ మీద పడింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బంక్ సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్న చేసినా ఆగక పోవడంతో స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. వాహనదారుడికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

కనగల్: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం కనగల్ మండలం జి.యడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మదనపురం స్టేజీ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జి. యడవల్లి గ్రామానికి చెందిన బొమ్మకంటి సాయి, పర్సనబోయిన గోపి అదే గ్రామపంచాయతీ పరిధిలోని మదనపురం నుంచి బైక్‌పై యడవల్లికి వెళ్తున్నారు. అదే సమయంలో చండూరు మండల పరిధిలోని దోనిపాముల గ్రామానికి చెందిన నాగిళ్ల పద్మ, ఆమె కుమారుడు కిరణ్ బైక్‌పై కనగల్ వైపు వస్తుండగా మదనపురం స్టేజీ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొమ్మకంటి సాయి, నాగిళ్ల కిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ నాగేష్ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగల అరెస్ట్

- సుమారు రూ.4లక్షల నగదు, కిలో వెండి ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్, వెనుక నిందితులు

సూర్యాపేట క్రైం: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను కోదాడ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ. 4లక్షల నగదు, కిలో వెండి ఆభరణాలతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ అంజనేయులు తన సిబ్బందితో కలిసి కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి పాఠశాల సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై అటుగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపేందుకు ప్రయత్నించగా వారు తప్పించుకొని పారిపోయారు. అనుమానంతో వారిని వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్ద సుమారు కిలో బరువు గల వెండి పళ్లెం, పట్టీలు లభించాయి. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా కోదాడ పట్టణంలోని బంజారా కాలనీకి చెందిన గుంజి వేలాద్రి, అదే కాలనికి చెందిన వేముల బాలక్రిష్ణగా గుర్తించారు. వీరిద్దరు మంచి స్నేహితులు కాగా, ఇద్దరూ ఒకే చోట సుతారీ పని చేస్తుంటారు. ఇద్దరి కుటుంబాల్లో అనారోగ్య సమస్యల కారణంగా అప్పులయ్యాయి. వాటిని తీర్చడం కోసం దొంగతనం చేయాలని భావించారు. అందులో భాగంగా వారికి బంధువు అయ్యే కోదాడలోని అజాద్‌నగర్‌కు చెందిన కారుమంచి శ్రీను నివాసంలో ఈ నెల 15న అర్ధరాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో భద్రపర్చిన సుమారు రూ.4లక్షల నగదుతో పాటు కిలో వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. నగదును మాత్రం ఇద్దరూ సమానంగా పంచుకున్నారు. వెండి ఆభరణాలను సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేటలో విక్రయించేందుకు బైక్‌పై వెళ్తూ పోలీసులకు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. వారి నుంచి రూ.4లక్షల నగదు, కిలో వెండి ఆభరణాలు, ఒక బైక్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడు వేలాద్రిపై ఖమ్మం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఒక దొంగతనం కేసు, బాలక్రిష్ణపై మేళ్లచెర్వు పోలీస్ స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యం విక్రయం కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. చోరీ కేసును త్వరగా ఛేదించిన కోదాడ పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, పట్టణ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, రామాంజనేయులు, సిబ్బంది ఎల్లారెడ్డి, సతీష్ ఉన్నారు.

ఆలేరు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం



ఘటనా స్థలంలో ధ్వంసమైన వాహనాలు



పల్టీకొట్టిన ఆటో, పక్కన కమలమ్మ మృతదేహం

- ఆటోను వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి స్కార్పియోను ఢీకొన్న వైనం
- ఒకరు మృతి, నలుగురికి గాయాలు

ఆలేరురూరల్: ఆలేరు శివారులోని దర్గా సమీపంలో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం 11గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆలేరు ఎస్‌ఐ జి. వెంకటశ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా మరిగడి గ్రామానికి చెందిన గుగులోతు గోపాల్, కమలమ్మ(42) దంపతులు బతుకుదెరువు నిమిత్తం సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో నివాసముంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె మహేశ్వరి గర్భిణి కావడంతో వైద్య పరీక్షల నిమిత్తం జనగామలోని తెలిసిన వైద్యుడి వద్దకు సోమవారం తమ ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యలో ఆలేరు శివారులోని దర్గా సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు ఎడమ వైపునకు పల్టీ కొట్టడంతో ఆటోలో ఉన్న కమలమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. గోపాల్, మహేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోను ఢీకొట్టిన కారు అదుపుతప్పి కుడివైపున డివైడర్‌ను దాటుకుంటూ వెళ్లి అవతలి మార్గంలో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న స్కార్పియోను ఢీకొట్టింది. దీంతో స్కార్పియోలో ప్రయాణిస్తున్న వరంగల్‌కు చెందిన టి. మమత, మహేష్, విద్య, నిహాల్, మహితకు స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న వంశీకృష్ణ అతివేగంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కమలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను వారి బంధువులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్, జనగామ ఆస్పత్రులకు తీసుకెళ్లారు. మృతురాలి కొడుకు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి కేసు నిందితుడు

- 1.5 కిలోల గంజాయి, స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ నరసింహారావు

మిర్యాలగూడ అర్బన్: చెడు వ్యసనాలకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం సీఐ ఎ. నరసింహారావు విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన వాస సాయిశంకర్ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. గంజాయి సేవిస్తూ ఏ పని చేయకుండా తిరుగుతుండటంతో తన అవసరాలకు డబ్బులు లేక గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని గాంధీనగర్‌లో ఉండే ఓ వ్యక్తి వద్ద గంజాయి కొని చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి తన స్కూటీపై తిరుగుతూ విక్రయిస్తుండేవాడు. సోమవారం పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లెటైవర్ వద్ద ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి అటుగా వస్తున్న శంకర్ పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా విషయం ఒప్పుకున్నాడు. తన స్కూటీలోని 1.5 కిలోల గంజాయి, స్కూటీని సీజ్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు ఏ. సైదిరెడ్డి, బి. సుధీర్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ పి. వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఎస్. వెంకటేశ్వర్లు, ఎం. రామకృష్ణ, షేక్ అక్బర్ తదితరులున్నారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ పి. వెంకటగిరి అభినందించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

పెన్‌పహాడ్: విద్యుదాఘాతంతో గ్రామపంచాయతీ కార్మికుడికి తీవ్రగాయాలపాలైన సంఘటన మండల పరిధిలోని ఎల్లప్పకుంట తండాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఎల్లప్పకుంట గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న శంకర్‌నాయక్ ట్రాన్స్‌కో అధికారుల నుంచి ఎల్‌సీ తీసుకొని తండాలో వీధి దీపాలకు మరమ్మతులు చేశాడు. అనంతరం విద్యుత్ సరఫరాను కొనసాగించాలని ట్రాన్స్‌కో సిబ్బందికి తెలియజేయడంతో వారు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కొద్దిసేపటికి వీధి లైట్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారని భావించిన శంకర్‌నాయక్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లను కలపడానికి ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

సామాజిక వెలి వేశారని ఎస్పీకి ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్: గ్రామంలో నూతనంగా నిర్మించిన గుడికి స్థలం ఇవ్వలేదనే అక్కసుతో తన ఇంటి స్థలం గుండా రోడ్డు వేయాలని చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకించడంతో తన కుటుంబాన్ని సామాజికంగా వెలివేశారని మిర్యాలగూడ మండలం లావుడితండా గ్రామానికి చెందిన లావూరి పూరి సోమవారం నల్లగొండ ఎస్పీ అపూర్వ రావుకు ఫిర్యాదు చేసింది. గుడి నిర్మాణం కోసం తన ఇంటి స్థలంతో పాటు తన మరిది కుమారుడు లావూడి శ్రవణ్, సక్యాల ఇంటి స్థలం కూడా అడిగారని, కానీ దానికి తాము వ్యతిరేకించడంతో ఎలాగైనా తమకు ఇంటి స్థలం లేకుండా చేయాలని ఆ స్థలం గుండా రోడ్డు వేయాలని గుడి కమిటీ నిర్ణయించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు ఒప్పుకోకపోవడంతో గత సంవత్సర కాలంగా సామాజికంగా తమను వెలి వేసి తమ కులం వారు ఎవరూ శుభకార్యాలకు పిలవకపోవడంతో పాటు గుడిలోకి రానివ్వడంలేదని పేర్కొంది. గుడి కమిటీ సభ్యులు లావుడి చందు, లావుడి విజయకాంత్, లావుడి బిచ్యా, లావుడి హాతీ, లావుడి చీను, లావుడి మంగతా, లావుడి సేవా, లావుడి శ్రీహరిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకోం



మోత్కూరు మార్కెట్‌లో ధాన్యం పరిశీలిస్తున్న సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి

మోత్కూరు: ఇటీవల కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాలలో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకోమని సివిల్ సప్లయ్ డీఎం గోపికృష్ణ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకాలు, ఎగుమతి, రవాణాలో తీవ్రమైన జాప్యం జరుగుతుందని, మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని సోమవారం మోత్కూరు ప్రాంతం నుంచి పలువురు రైతులు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై డీఎం గోపికృష్ణ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి మోత్కూరులోని నాలుగు రైస్ మిల్లులను సందర్శించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి తూకాలు వేయించాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకుంటామని చెబుతుందని రైతులు ప్రశ్నించగా.. తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని డీఎం రైతులకు తెలిపారు. నాలుగు మిల్లులకు ఒక్కో మిల్లుకు రోజుకు రెండు లారీల లోడ్ చొప్పున ధాన్యం ఎగుమతి చేస్తున్నామని, నాలుగైదు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట మార్కెట్ కార్యదర్శి ఎదుళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు సేవా సహకార సంఘం సీఈఓ కె. వరలక్ష్మి, కోఆర్డినేటర్ పెండెం నరహరి, మిల్లర్లు ఉన్నారు.

కారు డోరులో తల ఇరుక్కొని బాలిక మృతి



ఇంద్రజ (ఫైల్)

అనంతగిరి: కారు డోరులో తల ఇరుక్కొని బాలిక మృతిచెందిన ఘటన మండలంలోని బొజ్జగూడెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొజ్జగూడెం గ్రామానికి చెందిన భూక్యా కోట్యా కుమార్తె వివాహం సోమవారం జరిగింది. వివాహం అనంతరం నూతన వధూవరులు కారులో వెళ్తుండగా వారితో పాటు కారు వెనుక సీటులో బానోతు వెంకటేశ్వర్లు కుమార్తె ఇంద్రజ(9) కూర్చుంది. ఈ క్రమంలో ఇంద్రజ కారు డోరులోంచి తల బయట పెట్టి డ్యాన్స్ చేస్తుండగా డ్రైవర్ శేఖర్ అద్దం పైకి లేపడంతో ఊపిరాడక చనిపోయింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్య సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా ఆస్పత్రిలో ఫిజియోథెరపి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదాద్రి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి



మానసిక రుగ్మతల నివారణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మానసిక ఆరోగ్య రుగ్మతల నివారణ కేంద్రాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మానసిక ఆరోగ్య రుగ్మతల నివారణ కేంద్రం, వయోవృద్ధుల ఫిజియోథెరపి కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కోవిడ్ అనంతరం పిల్లలు, పెద్దలు, ఉద్యోగులు, వ్యాపారులు గృహిణులు, విద్యార్థులు అనేక రకాల మానసిక రుగ్మతులతో బాధపడుతున్నారని అన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మానసిక ఆరోగ్య రుగ్మతల నివారణ కేంద్రంలో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రోగులకు పరీక్షల అనంతరం మందులు ఉచితంగా ఇవ్వబడుతుందని చెప్పారు. ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్న వారు ఆస్పత్రిలో ఫిజియోథెరపి కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, డాక్టర్ సుమన్ కళ్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

మోత్కూరు: మోత్కూరుకు చెందిన కూరెళ్ల రవి తన సెల్‌ఫోన్ పోయిందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రర్(సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో సెల్‌ఫోన్‌ను కనిపెట్టి సోమవారం బాధితుడు రవికి ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే నూతన టెక్నాలజీతో వీలైనంత త్వరగా పట్టుకొని అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

జన విజ్ఞాన వేదిక మాజీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మృతి



పాదూరి శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లా జన విజ్ఞాన వేదిక మాజీ కార్యదర్శి పాదూరి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. నల్లగొండ పట్టణ శివారు గ్రీన్‌హిల్స్ కాలనీలో రోడ్డుపక్కన పడి ఉండగా స్థానికులు గుర్తించారు. ఆయన పక్కన స్కూటీ కూడా కింద పడి ఉంది. శ్రీనివాస్‌రెడ్డి మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సంతాపం తెలిపారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నేతల పోటాపోటీ ధర్నాలు

- అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల నిగ్గు తేల్చాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు



ధర్నా చేస్తున్న బీజేపీ కౌన్సిలర్ సుర్కంటి జ్యోతి రంగారెడ్డి, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీమిత్ర సాయిసాధ వెంచర్‌లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల వ్యవహారంలో అక్రమాల నిగ్గు తేల్చాలని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, ఇటు బీజేపీకి చెందిన కౌన్సిలర్ సుర్కంటి జ్యోతిరంగారెడ్డి పట్టణ కేంద్రంలో సోమవారం పోటాపోటీగా ధర్నాలు నిర్వహించారు. భూ ఆక్రమణలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి పాత్ర ఉందని కౌన్సిలర్ సుర్కంటి జ్యోతిరంగారెడ్డి ఆరోపించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ కేంద్రంలోని ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద ఉదయం టెంట్ వేసుకొని తన అనుచరులతో నిరసన దీక్ష చేపట్టారు. తనపై నిరాధారణ ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని, ఆధారాలుంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాక తాము సైతం అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కోరుతున్నామని, ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై కేసు కూడా నమోదయ్యిందని ఆయన తెలిపారు. ఏ చర్చకైనా సిద్ధమని చెప్పడంతో బీజేపీ కౌన్సిలర్ సుర్కంటి జ్యోతి మరికొందరు బీజేపీ నాయకులతో కలిసి నిరసన దీక్ష వద్దకు వచ్చారు. అక్కడ అధికార బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు అక్కడకు చేరుకుని బీజేపీ నాయకులను అక్కడి నుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేవరాయ కుమార్, సయ్యద్ అజ్జు, రావుల శ్రీను, చింతకింది కిరణ్, గోదాసు సీతయ్య, సంగెం చంద్రయ్య, గుండు ప్రవీణ్, మహేందర్, సాయి, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా

అయితే బీఆర్‌ఎస్ నాయకుల ధర్నాకు పోటీగా కౌన్సిలర్ జ్యోతిరంగారెడ్డి నేతాజీ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. భూ అక్రమాలపై విచారణ జరిపించి, అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయడంతో పాటు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. వీరికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, మండల అధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, వంగూరి స్వామి, కాంగ్రెస్‌నాయకులు గునిగంటి రమేశ్, మోటె రాజు, మెరుగు శశికళ, బాబు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయం తరలింపు

- పక్కనే ఉన్న ఫంక్షన్‌హాల్‌లోకి మార్పు
- నూతన భవనం నిర్మించే వరకు ఇక్కడి నుంచే సేవలు

సాక్షి ఎఫెక్ట్..



నూతన మున్సిపల్ భవనం వద్ద అధికారులు, పాలకవర్గ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయాన్ని పక్కనే ఉన్న ఫంక్షన్‌హాల్ అండ్ లాడ్జిలోకి మార్చారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ తాత్కాలిక భవనాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడం, గది పైకప్పు పెచ్చులూసి పడడంతో ఇటీవల ఓ ఉద్యోగికి ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో 'భయం భయంగా విధులు' అనే శీర్షికతో ఈనెల 8న సాక్షి కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన పాలకవర్గం కార్యాలయాన్ని తాత్కాలికంగా మరో చోటకు మార్చాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మున్సిపల్ ఆధీనంలో ఉన్న ఫంక్షన్‌హాల్, లాడ్జిలోకి తరలించారు.

నూతన భవనానికి త్వరలోనే శంకుస్థాపన

ప్రస్తుతం ఉన్న మున్సిపల్ భవనాన్ని కూల్చివేసి దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించనున్నారు. త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్ తెలిపారు. నూతన భవనానికి రూ.3.20 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పిలువనున్నట్లు వెల్లడించారు. నూతన భవనం పూర్తయ్యే వరకు ప్రస్తుతం తీసుకున్న ఫంక్షన్‌హాల్ అండ్ లాడ్జి భవనం సేవలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు గౌళికార్ అరుణ, బూడిద సురేందర్, సీస విజయలక్ష్మి, గుండ్లపల్లి వాణి, సరోజ, ముక్కెర్ల మల్లేష్, తాళ్లపల్లి నాగరాజు, ఆవుల మమత, బబ్బూరి మౌనిక, దండబోయిన అనిల్, కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సయ్యద్‌బాబా, గోర్ల పద్మ, రిజ్వానా, ఇంచార్జ్ కమిషనర్ చక్రపాణి, మేనేజర్ నరేష్‌రెడ్డి, ఏఈ నవీన్‌గౌడ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ నర్సింహ, కృష్ణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.